జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

నల్లగొండ

సూర్యాపేట - యాదాద్రి భువనగిరి

ఆదివారం 5 ఏప్రిల్ 2026 పేజీలు : 14



2 లో..

క్రీస్తు బోధనలు.. మానవజాతి అంతటికి మార్గదర్శకాలు

## పెండింగ్‌లో ఉన్న

# భూములకు పట్టాలివ్వండి



కలెక్టర్‌కు ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి విజ్ఞప్తి

భూ సమస్యలపై విజయ విహార్‌లో కీలక సమీక్ష

క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ వేగవంతం చేయాలని అధికారులకు

జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ఆదేశం



నాగార్జునసాగర్ ఏప్రిల్ 4 ప్రజా జ్యోతి

నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని తిరుమల గిరి సాగర్ మండలంలో పెండింగ్ లో ఉన్న ఫారెస్టు భూములకు త్వరితగతిన డి -ఫామ్ పట్టాలు ఇవ్వాలని నాగార్జున సాగర్ శాసనసభ్యులు కుందూరు జయవీర్ రెడ్డి కోరారు,

2 లో..

2 లో..



## సూర్యాపేటలో రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు ప్రారంభం

గెలుపోటములను క్రీడా స్ఫూర్తితో తీసుకోవాలి

ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి

## అక్రమంగా తరలిస్తున్న లారీ లోడ్ బెరైటీస్ స్టోన్‌ను సీజ్ చేసిన ఎమ్మార్వో

అనంతగిరి ఏప్రిల్ 04 (ప్రజా జ్యోతి):

అక్రమంగా నిల్వచేసిన బెరైటీస్ స్టోన్ను రెవిన్యూ అధికారులు సీజ్ చేసినట్లు తహసిల్దార్ హిమబిందు అన్నారు. తాసిల్దార్ తెలిపిన వివరాలు ప్రకారం మండల పరిధిలోని మొగలాయి కోట గ్రామ శివారులో అక్రమంగా లారీ లోడ్ గల బెరైటీస్ స్టోన్ను నిల్వ చేసినట్లు నమ్మదగిన సమాచారం మేరకు ఆర్ఐ వెంకటనగేష్ తోపాటు జిపిఓ నరేష్ పంచునామ నిర్వహించి స్టోన్ సీజ్ చేసి కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు.తదుపరి చర్యల నిమిత్తం మైనింగ్ అధికారులకు సమాచారం అందించామని పూర్తి స్థాయిలో విచారించి స్టోన్ను నిల్వచేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.



## జాగృతి పార్టీలో చేరికలు

నూతనకల్... ఏప్రిల్ 04 (ప్రజా జ్యోతి):

మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మందడి సోమిరెడ్డి శనివారం హైదరాబాదులోని జాగృతి పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమక్షంలో పార్టీలో చేరినట్లు జాగృతి సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు ఎస్ కృష్ణవేణి రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు సయ్యద్ ఇస్మాయిల్ తెలిపారు ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కొరకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు ఈ కార్యక్రమంలో జాగృతి నాయకులు పిట్టల మహేష్ పాల్గొన్నారు



# సూర్యాపేటలో రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు ప్రారంభం

## గెలుపోటములను క్రీడా స్ఫూర్తితో తీసుకోవాలి

## ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి



సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 04(ప్రజాజ్యోతి):సూర్యాపేట జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రగ్బీ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ వారి సహకారంతో సూర్యాపేటలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం హర్షనీయమని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు.శనివారం జిల్లా కేంద్రంలోని కుడకుడ రోడ్డులో గల క్రికెట్ మైదానంలో రగ్బీ పోటీలను మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాదితో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు.రగ్బీ పోటీలు అమెరికా,యూరప్ దేశాల్లో ప్రత్యేకంగా ఆడే ఆటలని,అటువంటి ఆటల పోటీ సూర్యాపేటలో నిర్వహించడం చాలా సంతోషమని అన్నారు.వేసవికాలం కాబట్టి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.సీఎం రేవంత్ రెడ్డి క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే సీఎం కప్ పోటీలను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించారని తెలిపారు.క్రీడాకారులను ప్రోత్సహించాలని పేర్కొన్నారు.గెలుపోటములను క్రీడా స్ఫూర్తిగా తీసుకుని ఆడాలని అన్నారు.ఈ పోటీలలో 13 జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కొండపల్లి దిలీప్ రెడ్డి, కొణతం రాజేష్, గుణగంటి హేమ సతీష్ , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కోతి గోపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అంజద్ అంజలి,నాయకులు అక్కినపల్లి జానయ్య, రాచకొండ శ్రీనివాస్,ఆలేటి మాణిక్యం,దివ్య,నిర్వాహకులు తరుణ్ రెడ్డి,ప్రశాంత్ రెడ్డి,ఆదిత్య,జగన్, ఆంథోని,మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీస్తు బోధనలు.. మానవజాతి అంతటికి మార్గదర్శకాలు

## రన్ ఫర్ జీసస్ ప్రోగ్రాం లో ఎమ్మెల్యే బిఎల్ఆర్

**మిర్యాలగూడ, ఏప్రిల్ 04,( ప్రజాజ్యోతి ):**

ఏసుక్రీస్తు బోధనలు కేవలం ఒక మతానికి పరిమితమైనవి కావని, ప్రపంచం మానవజాతి అంతటికి మార్గదర్శకాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బి ఎల్ ఆర్ ), ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ లు అన్నారు. గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని పురస్కరించుకొని



నియోజకవర్గ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం మిర్యాలగూడ పట్టణంలో 'రన్ ఫర్ జీసస్' కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ఫ్లైఓవర్ నుండి ప్రధాన సాగర్ రోడ్డు వెంట క్రైస్తవులు, మత పెద్దలు రాజీవ్ చౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఎమ్మెల్యే బిఎల్ఆర్ ఎమ్మెల్సీ శంకర్ నాయకులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు చూపిన ప్రేమ కరుణ త్యాగం అందరికీ ఆదర్శం అన్నారు. సమాజంలో శాంతిని నెలకొల్పడం, పేదలకు సహాయం చేయడం పొరుగు వారిని ప్రేమించటం వంటివి పాటిస్తూ క్రీస్తు చూపిన మార్గంలో పయనించాలన్నారు. రన్ ఫర్ జీసస్ కార్యక్రమంతో ఐక్యతను చాటాలన్నారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ ప్రపంచ దేశాలలో ఎక్కువగా అనుసరిస్తున్నది క్రైస్తవమతం అన్నారు. పేదవారి కోసం సిలువ నెక్కిన క్రీస్తు మరణాన్ని జయించి మూడవరోజు పునరుద్ధానం చెందాడని ప్రపంచానికి శాంతి సౌభాగ్యాలను అందించాడని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్ పర్సన్ గుడిపాటి శిరీష నవీన్, కౌన్సిలర్లు కోడి రెక్క భవాని ఇంద్ర కుమార్, ఎర్రమళ్ళ దినేష్, క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ముండ్ల గిరి కాంతయ్య, చిలక విద్యాసాగర్, కోశాధికారి పెయ్యల ప్రసాద్, శ్రీరాముల సుకుమార్, పుట్టల ఎలీషా రోశయ్య, చార్లెస్ బెంజిమెన్, మోజెస్, ఇజ్రాయిల్,విక్టర్, పాల్గొన్నారు.

# హయత్‌నగర్ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి

**భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 04 (ప్రజాజ్యోతి):**

హయత్‌నగర్‌కు చెందిన ఎండి అఫ్జల్ రేజా (22) రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన భూదాన్ పోచంపల్లి మండలంలోని జూలూరు వద్ద చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, అఫ్జల్ రేజా జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తూ అక్కడే నివసించేవాడు. శుక్రవారం సాయంత్రం తన స్నేహితుడితో కలిసి వెళ్తుండగా, బైక్‌ను రోడ్డు పక్కన ఆపిన సమయంలో అతివేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ కె. భాస్కర్ రెడ్డి తెలిపారు.



# పెండింగ్‌లో ఉన్న భూములకు పట్టాలివ్వండి

## కలెక్టర్‌కు ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి విజ్ఞప్తి

## భూ సమస్యలపై విజయ విహార్‌లో కీలక సమీక్ష

## క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ వేగవంతం చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ఆదేశం

**నాగార్జునసాగర్ ఏప్రిల్ 4 ప్రజా జ్యోతి**

నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని తిరుమల గిరి సాగర్ మండలంలో పెండింగ్ లో ఉన్న ఫారెస్టు భూములకు త్వరితగతిన డి -ఫామ్ పట్టాలు ఇవ్వాలని నాగార్జున సాగర్ శాసనసభ్యులు కుందూరు జయవీర్ రెడ్డి కోరారు,శనివారం నాగార్జునసాగర్ విజయ విహార్ అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి జానారెడ్డి,ఎమ్మెల్సీ శంకర్ నాయక్,రెవిన్యూ అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్,తో నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి,నియోజకవర్గ పరిధిలో తిరుమలగిరి సాగర్ మండలంలో పెండింగ్ భూముల సమస్యలపై సమీక్ష సమావేశం లో ఆయన మాట్లాడుతూ తిరుమలగిరి సాగర్ మండలంలో దీర్ఘకాలిక భూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. గత 30 సంవత్సరాలుగా అటవీ భూములు సాగు చేసుకుంటున్న పేద రైతులకు డి- ఫామ్ పట్టాలు ఇవ్వాలి అసైన్మెంట్ భూముల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు.అనంతరం జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఫారెస్ట్ భూములకు డి-ఫామ్ పట్టాలిచ్చే ప్రక్రియ కొనసాగుతున్నదని,వెరిఫికేషన్ పూర్తయిన వెంటనే తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రభుత్వ భూముల పై ప్రస్తుతం ఉన్న వారిని గుర్తించేందుకు ప్రత్యేకంగా నాలుగు బృందాలు ఏర్పాటు చేశామని, గ్రామ స్థాయిలో సర్వే నిర్వహించి,గ్రామ సభల ద్వారా ధృవీకరణచేపడుతున్నామని తెలిపారు,ఇప్పటివరకు సుమారు 12,000 ఎకరాల భూమి సర్వే పూర్తయిందన్నారు. సర్వే నంబర్ల ఆధారంగా రికార్డులు సిద్ధం చేస్తున్నామని వివరించారు.రైతుబంధు వంటి పథకాలు దుర్వినియోగం జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు.ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తుల్లో రెవెన్యూ సంబంధిత సమస్యలను పరిష్కరించడంలో చొరవ తీసుకోవడం జరిగిందని చెప్పారు.ఫారెస్టు భూములకు సంబంధించి రెవెన్యూ అధికారులు,సిబ్బంది త్వరితగతిన వెరిఫికేషన్ పూర్తి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు,మాజీ మంత్రి జానారెడ్డి,ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రెవిన్యూ అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి,జిల్లా గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్,జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి,తిరుమలగిరి సాగర్ తహసిల్దార్ అనిల్ తదితరులు ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.



# మిల్లర్ల సిండికేట్ తో దగాపడుతున్న రైతన్న

ఇతర రాష్ట్రాలధాన్యం రాకుండా సరిహద్దు చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలి

ఐకెపి కేంద్రాలు వెంటనే తెరవాలి

– మాజీ మార్కెట్ చైర్మన్ చింత రెడ్డి శ్రీనివాసరెడ్డి





మిర్యాలగూడ, ఏప్రిల్ 04,( ప్రజాజ్యోతి ):

మిర్యాలగూడ నియోజకవర్గం పరిధిలోని పలు రైస్ మిల్లులను మాజీ మార్కెట్ చైర్మన్ , రైతుబంధు మాజీ జిల్లా అధ్యక్షుడు చింత రెడ్డి శ్రీనివాసరెడ్డి శనివారం సందర్శించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగి ధాన్యం ప్రారంభమైన మొదటి రోజుల్లో క్వింటాలకు 2,750 ధర ఇచ్చిన వ్యాపారులు, మూడు రోజులుగా సిండికేట్ గా ఏర్పడి 2,400 మాత్రమే ఇస్తున్నారని ఆరోపించారు.ఏపీ, ఇతర రాష్ట్రాలనుంచి పెద్ద మొత్తంలో ధాన్యం ఇక్కడ మిల్లులకు వస్తున్నందున ప్రభుత్వం సరిహద్దు చెక్పోస్టులు ఏర్పాటు చేసి నియంత్రించాలని కోరారు.కెవెన్ ఎమ్ , మహేంద్ర చింటూ రకాలను కొందరు మిల్లర్లు మాత్రమే కొనుగోలు చేస్తూ క్వింటాల్ కు 2,100 మాత్రమే ధర చెల్లిస్తున్నారని రైతులను దోపిడీ చేస్తున్నారన్నారు. గత ఏడాది యాసంగి బోనస్ ఇంతవరకు రైతులకు చెల్లించలేదని ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం ఐకెపి కేంద్రాల వెంటనే తెరిచి ధాన్యం కొనుగోలు ప్రారంభించి రైతులకు బోనస్ ఇవ్వాలని కోరారు.రైతులు వారం రోజులుగా ఆందోళన చెందుతున్న ఎంపీ, ఎమ్మెల్యే,అధికారులు మిల్లు వద్దకు కనీసం వెళ్లకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం వెంటనే రెవిన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులతో బృందాలు ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధరలు అందేలా చూడాలన్నారు. పెట్టుబడి వ్యయం బాగా పెరిగినందున కనీసం క్వింటాలకు 3,000 గిట్టుబాటు ధర అందించేలా చూడాలని కోరారు.ఆయన వెంట మండల బారాస అధ్యక్షుడు మట్టపల్లి సైదయ్య, సర్పంచులు ప్రసాద్,సాగర్ నాయక్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రైతులు మధుసూదన్, నాగేశ్వరరావు,వెంకన్న, నందకిషోర్,నిఖిల్ రెడ్డి, చరణ్ రెడ్డి , నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు




నార్కట్ పల్లి, ఏప్రిల్ 4 ( ప్రజా జ్యోతి):

కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష పూరిత రాజకీయం చేస్తుందని, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చక పోగా, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులను పదేపదే పోలీస్ స్టేషన్ కు తరలించడం దుర్మార్గమైన చర్య అని చెరువుగట్టు మాజీ సర్పంచ్ మల్గా బాలకృష్ణ పేర్కొన్నారు. శనివారం పోలీస్ స్టేషన్లో మాజీ సర్పంచ్ తో మాట్లాడుతూ... బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కాంగ్రెస్ పార్టీ వైఖరి పై పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిగూడెం మాజీ సర్పంచ్ కొండూరు శంకరయ్య గౌడ్, చిన్న నారాయణపురం మాజీసర్పంచ్ కొత్త నరసింహ యాదవ్, లింగోటం సర్పంచ్ వెంకటయ్య గౌడ్, పాల్గొన్నారు.

## 50 కిలోల బియ్యం అందజేత

11వ వార్డు కౌన్సిలర్ సంపత్



ఆలేరు ఏప్రిల్ 4 ప్రజా జ్యోతి

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపల్ పరిధిలోని 11వ వార్డులో విలువల లక్ష్మణ్ అకారణంగా మరణించగా వారి కుటుంబ సభ్యులను 11వ వార్డు కౌన్సిలర్ జూకంటి సంపత్ పరామర్శించి 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ సాగర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లేష్, మైనార్టీ నాయకులు రఫీ, రాజు నారాయణ, ఉమేష్ ,చందు ,తదితరులు పాల్గొన్నారు.

## బిక్కేరూ వాగులో పూజలు

ప్రభుత్వ విప్ ఐలయ్య చిత్రపటానికి పాలభిషేకం

గ్రామ సర్పంచ్ మంత్రి లతా స్వామి

ఆలేరు ఏప్రిల్ 4 ప్రజా జ్యోతి

యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని తే ర్యాల గ్రామంలో బిక్కేరు వాగు ప్రవహిస్తున్న సందర్భంగా గ్రామ సర్పంచ్ మంత్రి లతా స్వామి శనివారం గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించి వారి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ అధ్యక్షులు భూపాల్ రెడ్డి, ఓబిసి సెల్ అధ్యక్షులు శ్రీకాంత్ చిన్నం రాములు, మల్లయ్య, వెంకటేష్ ,సతీష్, మహేందర్ బాలకృష్ణ రైతులు తదితరులు పాల్గొన్నారు.



## అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర 7 వ మహాసభ ను జయప్రదం చేయండి

అరుణోదయ జిల్లా అధ్యక్షులు శికిలం కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి

యెల గందుల సిద్దులు

ఆలేరు ఏప్రిల్ 4 ప్రజా జ్యోతి

దోపిడీ రాజ్యంపై ఎక్కుపెట్టిన గళమై, శ్రామిక వర్గాల వెన్ను తట్టే బలమై, ఉదయించిన స్వర ప్రభాతమే అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో గర్జించిన బండి యాదగిరి వారసత్వాన్ని ఒడిసి పట్టుకొని, నక్సల్బరి ప్రసరించిన నవకాంతులతో శ్రీకాకుళ జమిడిక మోత పాణిగ్రాహి పాటల స్ఫూర్తితో, గోదావరి లోయ ప్రతిఘటన పోరాట ప్రేరణతో అరుణోదయ 1974లో ఆవిర్భవించిందని, 52 వసంతాల ఈ సుధీర్ఘ పయనంలో దోపిడీ,పీడన, అసమానత,అణిచివేతలకు వ్యతిరేకంగా డప్పుల దరువులు మోగిస్తూ ఉప్పెన తీరుగా ఉరికొస్తు జనపదాలతో జైత్రయాత్ర సాగిస్తుందని, సామ్రాజ్యవాద, భూస్వామ్య సంస్కృతులను ప్రతిఘటిస్తూ, నూతన సంస్కృతిని నిర్మించడం కోసం సమస్త పీడిత ప్రజలతో కలిసి, భూమి, భుక్తి, విముక్తి పోరాటంలో ఉద్యమిస్తుందని ఈ క్రమంలోనే తన తెలంగాణ రాష్ట్ర ఏడవ మహా సభలను అరుణోదయ సంస్కృతిక సమాఖ్య పురుడు పోసుకున్న హైదరాబాద్ నడిగడ్డపై 2026 ఏప్రిల్ 10,11 తేదీలలో నిర్వహించుకోవడం మంచి పరిణామం అని ఈ మహాసభలను కవులు, రచయితలు, కళాకారులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని అరుణోదయ జిల్లా అధ్యక్షులు శికిలం కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి యెల గందుల సిద్ధులు కోరారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తెలంగాణ రాష్ట్ర ఏడవ మహాసభల గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు ఇక్కిరి సహదేవ్, పి.సుదర్శన్,మాలోత్ మోతీలాల్, మారుజోడు సిద్దేశ్వర్,ఆర్.ఉదయ్, మామిడాల భానుచందర్, వడ్డేపల్లి బాలరాజు, మారుజోడు కుమార్, నల్ల నర్సింగరావు,దార భాస్కర్, మేకల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన దాయం విక్రమ్ రెడ్డి

## సిద్ధాంతాల కోసం జీవించిన నాయకుడికి ఘన నివాళి



**తుంగతుర్తి, ఏప్రిల్ 4,(ప్రజా జ్యోతి):**

నమ్మిన సిద్ధాంతానికి నైతిక విలువలకు ఆదర్శాలకు మార్గదర్శకంగా నిలిచిన మహోన్నతమైన వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి కామ్రేడ్ దాయం విక్రమ్ రెడ్డి అని ఎమ్మెల్యే మందుల సామెల్,ఎమ్మెల్సీ నెలికంటి సత్యం అన్నారు. మండల పరిధిలోని వెంపటి గ్రామానికి చెందిన తిరుమలగిరి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కామ్రేడ్ దాయం విక్రం రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా విగ్రహావిష్కరణ కార్యక్రమం కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు,అభిమానులు, పెద్ద సంఖ్యలో హాజరై ఆయనకు ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వివిధ పార్టీల నాయకులు మాట్లాడుతూ... కామ్రేడ్ దాయం విక్రమ్ రెడ్డి రాజకీయ జీవితంలో దాదాపు 30 ఏళ్ల పాటు గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో కీలక పాత్ర పోషించారన్నారు. నిస్వార్థ సేవాభావంతో ప్రజల కోసం అహర్నిశలు శ్రమించిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొన్నారు. 1970 వ దశకం లో ఉవ్వెత్తున నడుస్తున్న విప్లవోద్యమంలో పాలు పంచుకుని పి డి ఎస్ యు లో చేరి గ్రామ యువత సహకారంతో రైతు కూలి సంఘాలు ఏర్పాటు చేసి పోరాడిన వ్యక్తి అన్నారు. తన తండ్రి తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ దాయం రాజిరెడ్డి ఆలోచనల మేరకు సిపిఐ పార్టీలో చేరి 1981 లో మొదటిసారి వెంపటి గ్రామ సర్పంచ్ గా గెలుపొందడమే కాకుండా తదనంతరం 1988లో ఏకగ్రీవ సర్పంచ్ గా ఎన్నికయ్యారని తెలిపారు. గ్రామంలో ఐక్యత ప్రశాంతత అభివృద్ధి ప్రధాన అంశాలుగా తీసుకొని తన పాలనను కొనసాగించినట్లు తెలిపారు. 1982 లో నవీన యువజన మండల ని స్థాపించి యువతకు క్రీడల పట్ల ఆసక్తిని,సమాజం పట్ల బాధ్యతను పెంపొందించారని అన్నారు. 18 ఏళ్లపాటు అప్రహితంగా క్రీడా పోటీలు నిర్వహించి యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించి ఎంతో మంది క్రీడా నేపథ్యంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు రావడానికి దోహదపడ్డారన్నారు. నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి, నైతిక విలువలు, ఆదర్శాలు, క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిన ఆయన జీవితం యువతకు ఆదర్శప్రాయంగా నిలుస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన ప్రజానాయకుడిగా ఆయన సేవలను స్మరించుకున్నారు. ఆయన ఆశయాలను కొనసాగించడం ద్వారా నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తప్పట్ల ఎల్లయ్య, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి బండ ప్రకాశ్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మల్లు కపోతం రెడ్డి,వివిధ గ్రామాల సర్పంచులు,వివిధ పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులు, వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన అభిమానులు, గ్రామస్థులు పాల్గొన్నారు.





## కోర్ర దేవజ మృతి బాధాకరం:టీపీసీసీ సభ్యులు వేణుధర్ రెడ్డి

### రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేత

**మల్లేపల్లి, ఏప్రిల్ 04,(ప్రజాజ్యోతి):**

కొర్ర తండ గ్రామానికి చెందిన కోర్ర దేవజ అనారోగ్యంతో మృతి చెందడంతో టీపీసీసీ సభ్యులు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ డాక్టర్ వేణుధర్ రెడ్డి దేవుజా పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి బాధను పంచుకుంటూ దహన సంస్కారాల కోసం రూ. 10,000ల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బుజ్జి లక్ష్మణ్ నాయక్, మాజీ సర్పంచ్ లచ్చిరాం నాయక్, ఉప సర్పంచ్ నాగరాజు నాయక్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## తాటి చెట్టు పై నుండి పడి వ్యక్తి తీవ్ర గాయాలు



**మోత్కూరు ఏప్రిల్ 4 (ప్రజాజ్యోతి)**

యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం పరిధిలోని పాటిమట్ల గ్రామంలో ఒక ప్రమాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రాచకొండ సుధాకర్ గౌడ్ (వృత్తిరిత్యా తాటి చెట్లు ఎక్కి పని చేసే వ్యక్తి) తాటి చెట్టు పైకి ఎక్కిన సమయంలో ప్రమాదవశాత్తు జారి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో సుధాకర్ గౌడ్ తీవ్రంగా గాయపడగా, కుటుంబ సభ్యులు మరియు స్థానికులు వెంటనే స్పందించి అతనిని సమీప ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన గ్రామంలో ఆందోళన కలిగించింది. సుధాకర్ గౌడ్ త్వరగా కోలుకోవాలని గ్రామస్తులు ఆకాంక్షిస్తున్నారు. అలాగే, ఇటువంటి ప్రమాదాలు జరగకుండా తాటి చెట్లపై పని చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని స్థానికులు సూచిస్తున్నారు.

## ప్రపంచ పాపముల కొరకు ప్రాణాలర్పించిన యేసు

**నాంపల్లి, ఏప్రిల్,04(ప్రజా జ్యోతి):**

ప్రపంచ పాపముల కొరకు శుభశుక్రవారం యేసు ప్రాణం అర్పించారు. హెబ్రీయులకు 12:1ఇంత గొప్ప సాక్షి సమూహము మేఘమువలె మనలను ఆవరించియున్నందున హెబ్రీయులకు 12:2మనము కూడ ప్రతిభారమును, సుళువుగా చిక్కులబెట్టు పాపమును విడిచిపెట్టి, విశ్వాసమునకు కర్తయు(మూలభాషలో-సేనాధిపతియు) దానిని కొనసాగించు వాడునైన యేసువైపు చూచుచు, మన యెదుట ఉంచబడిన




పందెములో ఓపికతో పరుగెత్తుదము. ఆయన తనయెదుట ఉంచబడిన ఆనందముకొరకై అవమానమును నిర్లక్ష్యపెట్టి, సిలువను సహించి, దేవుని సింహాసనముయొక్క కుడి పార్శ్వమున ఆసీనుడైయున్నాడు.

## గజ్వేల్ ఘటనపై బీఆర్ఎస్ ఆగ్రహం -- కేసీఆర్ క్యాంప్ కార్యాలయంపై దాడిని ఖండించిన పోన్నెబోయిన రమేష్

యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ గజ్వేల్‌లో కేసీఆర్ క్యాంప్ కార్యాలయంపై దాడి చేసి, ఫర్నీచర్ ధ్వంసం చేయడంతో పాటు రేవంత్గజ్వేల్ ఘటనపై బీఆర్ఎస్ ఆగ్రహం -- కేసీఆర్ క్యాంప్ కార్యాలయంపై దాడిని ఖండించిన పోన్నెబోయిన రమేష్ రెడ్డి ఫోటో పెట్టి అల్లర్లు సృష్టించిన కాంగ్రెస్ మూకల తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ మోత్కూర్ మండల పార్టీ అధ్యక్షులు పోన్నెబోయిన రమేష్ తెలిపారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకుని ఇలాంటి దౌర్జన్యానికి పాల్పడటం కాంగ్రెస్ పార్టీ యొక్క అహంకారం, అసహనం, రాజకీయ దివాళాను స్పష్టంగా చూపిస్తున్నదని ఆయన అన్నారు. ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించాలి గానీ గోడలపై బలవంతంగా ఫోటోలు పెట్టడం సరైన మార్గం కాదని సూచించారు.



రాజకీయంగా కేసీఆర్ ని ఎదుర్కోలేక, ఇలాంటి నీచమైన దాడులకు దిగడం కాంగ్రెస్ దివాళా రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. తెలంగాణ కోసం పోరాడి రాష్ట్రాన్ని నిర్మించిన నాయకుడిపై ఇలాంటి దాడులు చేయడం అంటే తెలంగాణ ఆత్మగౌరవంపైనే దాడి చేసినట్టేనని పేర్కొన్నారు. ప్రజల ప్రేమ, విశ్వాసం సంపాదించిన కేసీఆర్‌ను అల్లరి మూకలతో కాదు, ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే ఎదుర్కోవాలని రమేష్ హితవు పలికారు. కాంగ్రెస్ నాయకత్వం ప్రోత్సాహంతో జరుగుతున్న ఈ రాజకీయ గూండాగిరిని తెలంగాణ సమాజం ఎప్పటికీ మన్నించదని హెచ్చరించారు. కేసీఆర్‌పై దాడి అంటే బీఆర్ఎస్ కార్యకర్తలపైనే కాకుండా తెలంగాణ భావజాలంపైన దాడి చేసినట్టేనని పేర్కొంటూ, ఇలాంటి అల్లరి మూకలపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# డంపింగ్ యార్డ్ గా హాలియా బస్టాండ్

### - భరించలేని దుర్వాసన
### - అనారోగ్యానికి గురవుతున్న చుట్టుపక్కల ప్రజలు
### - బస్టాండ్ నిర్వహణ ప్రశ్నార్థకం

**హాలియా,ఏప్రిల్3(ప్రజా జ్యోతి)**

వేలాది మంది ప్రయాణికులతో రద్దీగా ఉండే హాలియా బస్టాండ్ ప్రాంతం పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పారిశుద్ధ్యం లేక పెద్ద ఎత్తున దుర్వాసన వెదజల్లుతుండడంతో ప్రయాణికులు ముక్కు మూసుకుంటూ బస్టాండ్ లో నిలబడతున్నారు.చెత్త పేరుకుపోయి, మురుగునీరు నిల్వ ఉండడంతో దోమలు ఈగలు బెడద పెరిగి చుట్టుపక్కల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.సెప్టిక్ ట్యాంకు తాగునీటి ట్యాంకు మరుగుదొడ్ల గదులు అస్తవ్యస్తంగా మారాయి.దీంతో బస్టాండ్ సమీపంలో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారు ఈ దుర్గంతో ఎదుర్కొంటున్నారు. టాయిలెట్లకు ఆనుకోని ఉన్న వాటర్ ట్యాంక్ నీరు లీక్ అవుతుండడంతో బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో నీరు నిలిచి దోమలకు కేంద్రాలుగా మారాయి.

### కానరాని పారిశుద్ధ్యం

బస్టాండ్ లోకి బస్సులు లోపలికి వెళ్లే ప్రాంతంలో నిర్మించిన ఈ టాయిలెట్స్ దుర్గంధం వెదజల్లుతున్నాయి. ఈ టాయిలెట్స్ నిర్వహణ సక్రమంగా లేక టాయిలెట్స్ చుట్టుపక్కల ప్రాంతాల్లోనే ఆరుబయట మూత్రం కానిస్తుండడంతో దుర్గంధం వస్తుంది.పరిసరాల్లో చెత్తాచెదారం నిల్వలు ఉంటున్నాయి. బస్టాండ్ లోపలికి



ప్రయాణికులు వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే.ప్లాస్టిక్ వ్యర్థాలు,కాటన్ డబ్బాలు,ప్లాస్టిక్ కవర్లు,వాటర్ బాటిల్లు ఎక్కడపడితే అక్కడ పడేస్తున్నారు.డస్ట్ బిన్ లు ఎక్కడ ఏర్పాటు చేయకపోవడంతో చెత్తాచెదారం చెల్లాచిదురుగా ఉంటుంది.ప్రయాణికులకు మూత్రశాలలు ఉన్న నిర్వహణ లేక అధ్వానంగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత ఆర్టీసీ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# తెరపైకి గట్టుప్పల్ కాంతి ఫార్మా కంపెనీ నిర్మాణం పనులు

### మునుగోడు ఉప ఎన్నికల్లో కేటీఆర్ ఆదేశాలతో ఆగిన పనులు
### కాంతి ఫార్మా పనులు చేపడితే ఉద్యమం తప్పదు

### బిఆర్ఎస్ గట్టుప్పల మండల కన్వీనర్ ఇడం కైలాసం డిమాండ్

**సంస్థాన్ నారాయణపురం,**

ఏప్రిల్ 04, (ప్రజాజ్యోతి) : నల్లగొండ జిల్లా గట్టుప్పల మండలం శివారు ప్రాంతం లో యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక గ్రామ రెవెన్యూ కు ఆనుకొని ఉన్న కాంతి ఫార్మా కంపెనీ నిర్మాణ పనులు మళ్లీ తెరపైకి వస్తున్నాయి. మునుగోడు ఉప ఎన్నికల నుంచి నిలిచిపోయిన కంపెనీ నిర్మాణ పనులను ఇటీవల మళ్ళీ చేపడుతున్నట్లుగా అక్కడి ప్రజలు ఆరోపిస్తున్నారు. మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రి కేటీఆర్ ఆదేశాలతో కాంతి ఫార్మా కంపెనీ నిర్మాణ పనులు చేపట్టవద్దని ఆదేశించారు. అప్పటి కలెక్టర్ కృష్ణారెడ్డి వెంటనే నోటీసులు ఇప్పించి కంపెనీ పనులను నిలిపివేశారు. అప్పటినుంచి పనులు చేపట్టకుండా ఉన్న కాంతి ఫార్మా కంపెనీ యాజమాన్యం ఇటీవల మళ్ళీ కంపెనీ నిర్మాణం పనులను చేపడుతున్నట్లుగా తెలుస్తుంది. దీనితో మళ్లీ మూడు మండలాల ప్రజలు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఫార్మా కంపెనీ వల్ల చుట్టుప్రక్కల గ్రామాల పంటల భూములన్ని కాలుష్య కారకాలుగా మారుతాయి అని, జల వాయు కాలుష్యం వెదజల్లుతుందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గట్టుపల్, సంస్థాన్ నారాయణపురం, మునుగోడు మండలాల పరిధిలో పలు గ్రామాలకు ఈ కంపెనీ కాలుష్యం వల్ల తీవ్ర ఇబ్బందులు వస్తాయని అప్పట్లో ఉద్యమాలు నిర్వహించారు. భూగర్భ జలాలు కలుషితమై పంటలు కలుషితమయితాయని, తాటికల్లు గాలి వాతావరణం కలుషితమవుతుందన్నారు. అప్పట్లో ఫార్మా కంపెనీ వ్యతిరేక కమిటీని ఏర్పాటు చేసి గ్రామ గ్రామాన ప్రజలను చైతన్యవంతం చేశారు. అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో గట్టుప్పల్ మండల కేంద్రంలో ధర్నా కార్యక్రమాలు చేశారు. ఆదరణలో ప్రస్తుత సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పటి మునుగోడు ఇన్చార్జి చలమల కృష్ణారెడ్డి, బిఆర్ఎస్ మండల కన్వీనర్ ఇడం కైలాసం, సిపిఎం పార్టీల ఆధ్వర్యంలో జరిగిన ధర్నా కార్యక్రమాలలో పాల్గొన్నారు. అదే సమయంలో వచ్చిన ఉప ఎన్నికలతో రాష్ట్ర ప్రభుత్వం అంత మునుగోడు నియోజకవర్గంలో పర్యటించింది. సందర్భంగా గట్టుప్పలకు వచ్చిన మంత్రి కేటీఆర్ ను గ్రామ సర్పంచ్ ఇడం రోజా ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కాంతి ఫార్మా కంపెనీని ఇక్కడి నుంచి తరలించాలని కోరారు. అందించిన కేటీఆర్ అక్కడే ఉన్న కలెక్టర్ కు ఆదేశాలు జారీ చేసి కంపెనీ నిర్మాణం పనులు నిలిపి వేయించారు. నాటి నుంచి నేటి వరకు కంపెనీ పనులు ఆగిపోయాయి. ఇటీవల మళ్ళీ కాంతి ఫార్మా కంపెనీ యాజమాన్యం నిర్మాణ పనులు చేపట్టుతున్నట్లుగా అక్కడి ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని గమనించిన టిఆర్ఎస్ గట్టుప్పల్ మండల కన్వీనర్ ఇడం కైలాసం స్పందించారు. కంపెనీ నిర్మాణ పనులు చేపడితే మళ్ళీ ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు.





# “మహనీయుల జయంతి ఉత్సవాల్లో భాగస్వామ్యం అవుదాం

## మహనీయుల జయంతి ఉత్సవాలు జయప్రదం చేయండి

**భువనగిరి, ఏప్రిల్ 4**



(ప్రజాజ్యోతి)యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో,ఈనెల 5వ తేదీ నుండి 14వ తేదీ వరకు జరిగే బాబు జగ్జీవన్ రామ్, మహాత్మా జ్యోతి రావు పూలే, బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో భాగస్వామ్యం అవుదామని మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ప్రజా సంఘాల నాయకులు అన్నారు. మహనీయుల స్ఫూర్తితో ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీల ఐక్యతను చాటుదాం అని అన్నారు. ఈ సందర్భంగా మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా సమావేశం నిర్వహించడం జరిగింది. సమావేశం లో పాల్గొన్న జిల్లా అధ్యక్షులు ఇంతియాజ్ మాట్లాడుతు భారత రాజ్యాంగ పరిరక్షణకు, అణగారిన ప్రజలందరుకూడా ముందుకు,రావాలని ఇందు కోసం మైనార్టీలందరూ సంసిద్ధమని అన్నారు. అదే విధంగా ఏప్రిల్ లో జరిగే మహనీయుల ఉత్సవాలలో అధిక సంఖ్యలో ముస్లిం మైనారిటీ లందరు జై మీమ్ జై భీమ్ స్ఫూర్తితో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అలాగే భారత దేశం మత తత్వ శక్తులు,హిందూ ముస్లిం గొడవలు సృష్టించడానికి ప్రయత్నాలు చేస్తున్నాయని వాటిని తరిమి కొట్టడానికి ఎస్సి ఎస్టీ బీసీ మైనారిటీ లు కలిసి ఉంటేనే సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమం లో డీసీసీ కార్యదర్శి ఎండీ ఆబెద్ అలీ,అడ్వకెట్ డా,హమీద్ పాషా,సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి,ఎండీ ఇమ్రాన్ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు ఎండీ నాజీమ్,ఎండీ షానూర్ దళిత నాయకులు బట్టు రాంచంద్రయ్య కర్తల శ్రీనివాస్ సురుపంగా శివలింగం ఇటుకల దేవేందర్ కుతాడి సురేష్,క్రిస్టియన్ మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మూటకొండూరు పీహెచ్‌సీలో ప్రజాపాలన ప్రగతి నివేదిక

## 80 మందికి వైద్య సేవలు

**ఆలేరు ఏప్రిల్ 4 ప్రజా జ్యోతి**

యాదాద్రి-భువనగిరి జిల్లా మూటకొండూరు పీహెచ్‌సీ నందు



ప్రజా పాలన ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ కట్ట విజయ్, గ్రామ సర్పంచ్ భూమండల జయమ్మ శ్రీనివాస్, ఉప సర్పంచ్ వంగాల నిఖిల్ మహేష్, వార్డు సభ్యుడు జూకంటి మధు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. సర్పంచ్ జయమ్మ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు తమ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని, ఇలాంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డాక్టర్ కట్ట విజయ్ మాట్లాడుతూ వ్యాధులను ప్రాథమిక దశలో గుర్తిస్తే సులభంగా చికిత్స అందించవచ్చని, సమయానికి మందులు వాడడం ద్వారా ప్రాణాపాయం నివారించవచ్చని తెలిపారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, టిబి వంటి వ్యాధులపై పూర్తి స్థాయి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి 80 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి పై స్థాయి ఆసుపత్రులకు రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది నరసింహా, శ్రీనివాస్, సుభాషిని, యాకయ్య, జ్యోతి, నరేష్, ఉమేష్, ఆశా కార్యకర్తలు జ్యోతి, మహాలక్ష్మి, ఐలమ్మ, కవిత, మమతా, పద్మ, ప్రమీల, పంచాయతీ సెక్రటరీ సంతోష గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ దాడులకు భయపడదు

## తెలంగాణ రాష్ట్ర సాధకుడు బి ఆర్ ఎస్ అధినేత కెసిఆర్ క్యాంప్ కార్యాలయం పై కాంగ్రెస్ శ్రేణుల దాడులను ఖండిస్తున్నాం

## మాజీ జిల్లా పరిషత్ చైర్పర్సన్ గుజ్జ దీపికా యుగంధర్ రావు

**తుంగతుర్తి, ఏప్రిల్ 4,(ప్రజా జ్యోతి):**

తెలంగాణ రాష్ట్ర సాధకుడు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, గజ్వేల్ శాసనసభ్యులు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నా మనీ సూర్యాపేట జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ గుజ్జ దీపికా యుగంధర్ రావు అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో ఒకపక్క ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజల దృష్టిని మరలించేందుకు కాంగ్రెస్ నాయకులు ఇలాంటి చౌకబారు పనులకు పాల్పడడం హేయమైన చర్య అని అన్నారు. ప్రజా రాజ్యం, ఇందిరమ్మ రాజ్యం అని చెప్పుకుంటూ కాలం గడుపుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని రావణకాష్టంలా మార్చుతున్నాడనీ అన్నారు. ప్రధాన ప్రతిపక్ష నేత క్యాంపు కార్యాలయంపైనే దాడులు జరుగుతున్నాయంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఏ విధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చని అన్నారు. శాంతి భద్రతలు కేసీఆర్ పాలనలో ఏ విధంగా ఉండేవో నేటి కాంగ్రెస్ పాలనలో ఏ విధంగా ఉందో జరుగుతున్న సంఘటనలు బట్టి చెప్పవచ్చని అన్నారు. పోలీసులు ప్రజల ఆస్తులను ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సింది పోయి , అధికార కాంగ్రెస్ నాయకులకు కొమ్ముకాయడం విడ్డూరం గా ఉందని అన్నారు. రాష్ట్రంలో



పరిపాలన గాడి తప్పిందని రానున్న కాలంలో తిరిగి కెసిఆర్ సారధ్యంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని అన్నారు. అరాచక వాదులకు తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్న బి ఆర్ ఎస్ అధినేత తెలంగాణ రాష్ట్రాన్ని ఎలా సాధించాడో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునని ఇలాంటి చిల్లర పనులకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. రానున్న కాలంలో రాష్ట్ర ప్రజలు తగిన సమయంలో తగిన రీతిలో కాంగ్రెస్ పాలకులకు బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు.

# మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

## ఉప సర్పంచ్ వంగాల నికిత మహేందర్ గౌడ్

**ఆలేరు ఏప్రిల్ 4 ప్రజా జ్యోతి**

యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందికి ఆశ కార్యకర్తలకు పేషంట్లకు శనివారం గ్రామ ఉపసర్పంచ్ వంగాల నికిత మహేందర్ గౌడ్ సహకారంతో మజ్జిగ ప్యాకెట్లను గ్రామ సర్పంచ్ భూమండ్ల జయమ్మ శ్రీనివాస్ పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉండడం వల్ల ప్రతి ఒక్కరు



జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు బుగ్గ కొమురయ్య, వార్డు సభ్యులు జూకంటి మధు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా సయ్యద్ జలాలొద్దీన్ హుస్సేని రహెమతుల్లా అలై ఉర్సు గంధం ఊరేగింపు

**భువనగిరి,ఏప్రిల్ 4**

(ప్రజాజ్యోతి)భువనగిరి,పట్టణం లో జలీల్ పుర మస్జీద్ కమిటీ ఆధ్వ ర్యంలో పట్టణంలోని హైదరా బాద్,చౌరస్తా వద్ద ఉన్న హజరత్ సయ్యద్ షా జలాలొద్దీన్ రహేమతుల్లా దర్గా గంధం,ఊరేగింపు మస్జీద్ (ఏ సహాబ)జలీల్ పూర,నుండి గంధం ప్రారంభం అయ్యి నాతే షరీఫ్ ధార్మిక పాఠాలు పటిస్తూ గ్రంథం ఊరేగింపు, హైదరాబాద్ చౌరస్తా వద్ద ఉన్న దర్గా వరకు కొనసాగింది. దర్గా సజ్జాదే నషీన్,సయ్యద్ ముబషీర్ రజా ముఖ్య,అతిథిగా పాల్గొని చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థన జరిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలోవక్ఫ్ ప్రొటెక్షన్ కమెటీ యాదాద్రి జిల్లా అధ్యక్షులు ఇంతియాజ్ ప్రధాన కార్యదర్శి ఇస్తియాక్ జలీల్ పుర మజీద్ కమిటీ అధ్యక్షుడు ఇక్బాల్ చౌదరి ప్రధాన కార్యదర్శి కాజమ్ అహ్మద్,మొయిన్ రజా ముదదసిర్ రజాప్రధాన కార్యదర్శి ఇస్తియాక్ అహ్మద్, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, ఎండి నాజీమ్ దర్గా ఖాదీమ్ కబీర్,సమీయొద్దీన్ ఎండి అజీజ్, అతహర్,జబ్బార్ మిస్బ నొమన్ తదితరులు పాల్గొన్నారు.



# యుద్ధాలతో సాధించేదేమీ లేదు.. వినాశనం తప్ప

## – ఎమ్మెల్యే బి ఎల్ ఆర్
## మిర్యాలగూడలో యుద్ధ వ్యతిరేక భారీ శాంతి ర్యాలీ




**మిర్యాలగూడ, ఏప్రిల్ 04,( ప్రజాజ్యోతి ):**

యుద్ధాలతో వినాశనం తప్ప, సాధించేదేమీ లేదని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) అన్నారు. పశ్చిమ ఆసియాలో అమెరికా ఇజ్రాయిల్ లు ఇరాన్ పై చేస్తున్న యుద్ధాన్ని వెంటనే ఆపేయాలని శనివారం మిర్యాలగూడ పట్టణంలో వివిధ ప్రజా




సంఘాలు,సామాజికవేత్తలు,వివిధ రాజకీయ పార్టీలు కలిసి భారీ ఎత్తున అమరవీరుల స్థూపం నుండి రాజీవ్ చౌక్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. బీసం రామయ్య అధ్యక్షతన సభా కార్యక్రమాన్ని నిర్వహించారు. సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ యుద్ధాన్ని ఆపి వెంటనే శాంతి చర్చలు కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ వైపు నుంచి కోరుకుంటున్నామని తెలిపారు. జన విజ్ఞాన వేదిక జాతీయ కన్వీనర్ మువ్వా రామారావు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో యుద్ధాలు ప్రపంచవ్యాప్తంగా ప్రభావితం చేస్తాయని యుద్ధం వల్ల ఏ దేశం కూడా అభివృద్ధి చెందజాలదని అన్నారు. మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ యుద్ధాన్ని ఆపడానికి భారతదేశ ప్రభుత్వం కూడా కృషి చేయాలని లేకపోతే సామాన్య ప్రజలు ఇబ్బందులు పడవలసి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కస్తూరి ప్రభాకర్,సత్యనారాయణ రావ్, మౌసమ్ హుస్సేన్, ముస్లిం మైనార్టీ నాయకులు, విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, జాడి రాజు, బీసీ సంఘం నాయకులు చేగొండి మురళి యాదవ్, దాసరాజు జయరాజు, కందుకూరి సుదర్శన్, సామాజిక వేత్త కిరణ్మయి, ఉదయ, యుటిఎఫ్ నాయకులు బక్క శ్రీనివాసచారి,మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్ల పల్లి రవి, గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మాలోత్ దశరథ్ నాయక్, స్వామి, డివైఎఫ్ఐ నాయకులు రవి నాయక్, హరికృష్ణ, హఫీజ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి: సర్పంచ్



**నూతనకల్.. ఏప్రిల్ 04 (ప్రజాజ్యోతి):**

మండల పరిధిలోని అలుగునూరు ఎంపీపీ ఎస్ పాఠశాలను సర్పంచ్ కాసా నరేందర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసినానంతరం మాట్లాడుతూ పాఠశాలలోని విద్యార్థులు ఇంగ్లీష్ పై ఎక్కువ మక్కువ కలిగి ఉండాలని అదేవిధంగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పాఠశాలలో చదువుతున్న విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టి వారి ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేయాలని వారికి సూచించారు అనంతరం మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు వారి వెంట ఉప సర్పంచ్ గోరంట్ల వెంకన్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉప్పు నాగయ్య వార్డు సభ్యులు కొండల్ బంటు యాదగిరి వనం నాగరాజు పాఠశాల సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అత్యాధునిక వసతులతో రుద్రంగి కన్వెన్షన్స్ ప్రారంభం

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 04(ప్రజాజ్యోతి)**

:హైదరాబాద్ నగరంలో తరహాలో అత్యాధునిక వసతులు,అన్ని సౌకర్యాలతో జిల్లా కేంద్రానికి సమీపంలో రుద్రంగి కన్వెన్షన్స్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వర్ రావు, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది,



ఏఐసీసీ మాజీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు.శనివారం జిల్లా కేంద్రం సమీపంలో నేషనల్ హైవే పిల్లలమర్రి స్టేజీకి దగ్గరలో రుద్రంగి కన్వెన్షన్స్ ను ప్రారంభించి మాట్లాడారు.సూర్యాపేట జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత సూర్యాపేట ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. నిర్వాహకులు రుద్రంగి సురేష్ మంజుల మాట్లాడుతూ విశాలమైన బ్యాంక్వెట్ హాల్, పార్కింగ్, లైటింగ్, కాంపౌండ్ వాల్, అత్యాధునిక సౌకర్యాలతో అన్ని వసతులతో ఏర్పాటు చేసిన రుద్రంగి కన్వెన్షన్స్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతకు ముందు స్వర్ణగిరి అర్చకులతో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణంను వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఆలేరు లో వైద్య శిబిరం ప్రారంభం

## మున్సిపల్ చైర్మన్ బీజాన బాలమణి భాస్కర్





**ఆలేరు ఏప్రిల్ 4 ప్రజా జ్యోతి**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శనివారం పోచమ్మ గుడి దగ్గర బస్తీ దావకానలో ఉచిత వైద్య శిబిరం ఆలేరు మున్సిపల్ చైర్మన్ బాలమణి భాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా షారాజీపేట మెడికల్ ఆఫీసర్ హైమావతి, షుగర్ మరియు బిపి పరీక్షలు చేసి లబ్ధిదారులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎల్.హెచ్.పి డాక్టర్ లు సాయి తేజ, సరిత, ఎనిమిదో వార్డు కౌన్సిలర్ బోట్ల సంపత్, 12వ వార్డు కౌన్సిలర్ నీరజ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# జుబ్లాక్ పల్లిలో భక్తి సందడి... ఘనంగా సీతారాముల కళ్యాణం, మైసమ్మ ప్రతిష్టాపన వైభవం

**భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 04 (ప్రజాజ్యోతి)**

మండలంలోని జుబ్లాక్ పల్లి గ్రామంలో ధార్మిక వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. శ్రీశ్రీశ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణం, రథోత్సవం మరియు నాభిశిల (బొడ్రాయి) ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆలయ దేవస్థానం కమిటీ, గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి.ఇదే సందర్భంగా కోట మైసమ్మ దేవాలయ పునర్నిర్మాణం పూర్తి చేసి, నూతన విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిపారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై భక్తి శ్రద్ధలతో కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆర్ల కావ్య వెంకటేశం యాదవ్, ఉప సర్పంచ్ ఆర్ల లింగస్వామి యాదవ్, వార్డు సభ్యులు పోకల శివలీల చిరంజీవి, చినుకని శంకరయ్య యాదవ్, కొమ్ము కిషన్, పగుడాల జ్యోతి నర్సింహ, మీసాల నర్మద కృష్ణ, కడమంచి శివ, ముమ్మడి నర్సింహాచారి, తంగడపల్లి మమత మల్లేష్, తంగడపల్లి కిష్టయ్యతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



# ముందస్తు అరెస్టులు ప్రజాస్వామ్యానికి విరుద్ధం

## - బి ఆర్ ఎస్ నాయకులు

**మిర్యాలగూడ, ఏప్రిల్ 04,( ప్రజాజ్యోతి ):**

శాంతియుతంగా నిరసన తెలిపే వారిని అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం అని బిఆర్ఎస్ నాయకులు అన్నారు.






పార్టీ నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా శనివారం మిర్యాలగూడ టౌన్ పరిధిలో గల బి ఆర్ ఎస్ పార్టీ కౌన్సిలర్లను, వార్డు ఇంచార్జీ లను ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల స్వరాన్ని అణచివేయడానికి చేసే ఈ ప్రయత్నాలు ఎప్పటికీ సఫలం కావు అన్నారు . అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు. ప్రజల హక్కుల కోసం తమ పోరాటం కొనసాగుతూనే ఉంటుందన్నారు. అరెస్ట్ అయిన వారిలో 37,5,16 వ, వార్డు కౌన్సిలర్లు పెద్ది శ్రీనివాస్ గౌడ్,లావూరి సుధాకర్,జన్నపాల కిరణ్ 6,21,20,38 వార్డుల బి ఆర్ ఎస్ పార్టీ ఇంఛార్జ్ లు భూక్య రాంబాబు, పిన్నిబోయిన శ్రీనివాస్ యాదవ్, కందగట్ల అశోక్,బల్లెం అయోధ్య, బల్లెం శివరాం ఉన్నారు.

# దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

## మున్న మల్లయ్య యాదవ్

**నూతనకల్... ఏప్రిల్ 04 (ప్రజా జ్యోతి):**



ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ పై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అక్రమంగా చొరబడి ఫర్నిచర్ ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మున్న మల్లయ్య యాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రం లో ప్రభుత్వం పై పెరుగుతున్న వ్యతిరేకత నుంచి ప్రజల దృష్టి మరల్చడానికే కాంగ్రెస్ పెద్దల ఆలోచన ప్రకారమే ఇలాంటి అరాచకాలు చేస్తున్నారని. అన్నారు గత కొద్ది రోజుల క్రితం సూర్యాపేట ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో జరిగినప్పుడు పోలీసులు చర్య తీసుకుని ఉంటే మళ్ళీ ఇక్కడ పునరావృతం కాకుండా ఉండేదని అన్నారు. ఒక చోట జరిగినప్పుడు పోలీసులు చర్య తీసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం వల్లనే అన్నారు. గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసుపై దాడి అనేది తెలంగాణ రాష్ట్రం సాధించిన నేతఃి మనోభావాలను దెబ్బతేయాలనే కుట్రలో భాగమేనని అన్నారు. ఇలాంటి అరాచకాలు రాష్ట్రం లో మరెక్కడా జరగకుండా ఉండాలంటే పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. ఎన్ని అరాచకాలు సృష్టించినా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పై ఉన్న వ్యతిరేకత పోగొట్టుకోలేరని అన్నారు.

# ఘనంగా సర్పంచి దొంతగాని అప్పారావు జన్మదిన వేడుకలు

## దొంతగాని యువసేన ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, యాచకులకు అన్నదానం



**కోదాడ రూరల్, ఏప్రిల్ 04( ప్రజాజ్యోతి) :**

మండల పరిధిలోని కాపుగల్లు గ్రామ సర్పంచి దొంతగాని అప్పారావు జన్మదిన వేడుకలు దొంతగాని యువసేన ఆధ్వర్యంలో కోదాడలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కోదాడ ప్రభుత్వ దవాఖానాలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. అనంతరం భిక్షాటన చేస్తున్న వారికి ఆహార పొట్లాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జననాయకుడు దొంతగాని అప్పారావు జన్మదిన సందర్భంగా ఇలాంటి కార్యక్రమాలు చేయడం మాకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. గ్రామంలో గ్రామ ప్రజలు సర్పంచి జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారని అన్నారు. సర్పంచి గ్రామాభివృద్ధి కోసమే పాటుపడుతున్నారని ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని భగవంతుడు ఆయనకు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గోపి, తెలంగాణ రిపబ్లికం సేన జనరల్ సెక్రటరీ బోసు, పూర్ణాచారి, పాషా, నాగచారి, శ్రీనివాస్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.




# నేడు ఉచిత కంటి మెగా వైద్య శిబిరం

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 04(ప్రజాజ్యోతి):**

అక్షర ఫౌండేషన్ సూర్యాపేట ఆధ్వర్యంలో ఎస్ కెఆర్ కన్ స్ట్రక్షన్స్ ఆఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, శ్రీ కంచి కామకోటి మెడికల్ ట్రస్ట్ శంకర కంటి హాస్పిటల్ హైదరాబాద్, జిల్లా అందత్వ నివారణ కమిటీ సంస్థ వారు సంయుక్తంగా నేడు జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ కళ్యాణ మండపంలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత కంటి మెగా వైద్య శిబిరంను నిర్వహిస్తున్నట్లు అక్షర ఫౌండేషన్ అధ్యక్షులు ఉప్పు నాగయ్య, ఐ క్యాంప్ ఇంచార్జి బత్తుల దామోదర్ రెడ్డి తెలిపారు.ఈ కంటి వైద్య శిబిరంలో అన్ని కంటి సమస్యలు చూడబడునని తెలిపారు.ఉచిత ఆపరేషన్స్ తో బాటు ఉచిత భోజన వసతి, ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.కంటి ఆపరేషన్ చేయించుకున్న వారికి 15 రోజుల తర్వాత చెకప్ కూడ చేయబడునని చెప్పారు.ఆపరేషన్ అవసరం ఉన్నవారు ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు తీసుకురావాలని తెలిపారు.మరిన్ని వివరాలకు గడ్డం వీరబాబు సెల్ నెంబర్ 7036259911ను సంప్రదించవచ్చని తెలిపారు.సూర్యాపేట పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు ఈ ఉచిత కంటి మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# కెసిఆర్ క్యాంపు కార్యాలయం పై కాంగ్రెస్ దాడి పట్ల కండన

## బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సుర్వి యాదయ్య గౌడ్

**సంస్థాన్ నారాయణపురం,**

ఏప్రిల్ 04, (ప్రజాజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ క్యాంపు కార్యాలయం పై కాంగ్రెస్ చేసిన దాడిని మాజీ సర్పంచ్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ తీవ్రంగా ఖండించారు. శనివారం ఆయన మాట్లాడుతూ సిద్దిపేటలో రేవంత్ రెడ్డి రౌడీలు కేసీఆర్ క్యాంపు కార్యాలయం పై శనివారం దాడి చేయడం, ఫర్నిచర్ ను ధ్వంసం చేయడం రేవంత్ రెడ్డి ఫోటోను బలవంతంగా అక్కడ గోడలపై అతికించడం పట్ల తీవ్రంగా ఖండించారు. రేవంత్ రెడ్డి ఫోటోలు కెసిఆర్ ఆఫీసు కార్యాలయం పై పెట్టడం సరి అయింది కాదన్నారు. ఢిల్లీలో సోనియా గాంధీ రాహుల్ గాంధీ ప్రభుత్వం నివాసాల్లో నరేంద్ర మోడీ ఫోటోలు ఏమైనా పెట్టారా అని ప్రశ్నించారు. క్యాంపు కార్యాలయాలు అంటే ప్రజాప్రతినిధుల నివాసాల తప్ప ముఖ్యమంత్రి ఫోటోలు పెట్టే ఆఫీసులకు కావన్నారు. ఎంఐఎం, కేంద్ర మంత్రుల కు కేటాయించిన కార్యాలయాల్లో రేవంత్ రెడ్డి ఫోటోలు పెట్టారా అని నిలదీశారు. ప్రజల హృదయాలలో స్థానం సంపాదించాలే తప్ప



గోడలపై ఫోటోలు పెట్టడం కాదని ఎద్దేవా చేశారు. ఇలాంటి ఘటనలతో కాంగ్రెస్ పార్టీ ప్రజల దృష్టిలో మరింత దిగజారిపోతుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఎన్ని ప్రయత్నాలు చేసినా సైతాన్ పల్లి ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఎన్నికల్లో టిఆర్ఎస్ ఘన విజయం సాధించిందని స్పష్టం చేశారు. ఇలాంటి దాడులు చేస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని యాదయ్య గౌడ్ హెచ్చరించారు.